క్లుప్తంగా

అప్పన్నకు బంగారు గొలుసు బహూకరణ



బంగారు గొలుసును డిప్యూటీ ఈవో రాధకు అందిస్తున్న దాత కిరణ్‌రాజ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శ్రీకాకుళానికి చెందిన వైశ్యరాజు రాజారాం కిరణ్‌రాజ్ దాత శుక్రవారం 49 గ్రాముల బంగారు గొలుసును కానుకగా అందించారు. సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన దాత ఆ గొలుసు ను ఆలయ డిప్యూటీ ఈవో సింగం రాధకు అప్పగించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రంను అధికారులు అందించారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సూపరింటిండెంట్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో వృత్తి విద్య కోర్సులకు దరఖాస్తులు

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, ఇన్‌స్టిట్యూట్‌లో రాష్ట్ర ప్రభుత్వ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్‌చే గుర్తింపబడిన వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఏ గ్రూపులోనైనా ఉత్తీర్ణులైన విద్యార్థులు రెండేళ్ల డిప్లమో ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డిప్లమో ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్, డిప్లమో ఇన్ ఆప్టోమెట్రీ టెక్నీషియన్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు నాలుగేళ్ల వ్యవధి ఉన్న బీఎస్సీ ఆప్టోమెట్రీ చేసేందుకు అర్హులన్నారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో శంకర్ ఫౌండేషన్ కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 91210 05933, 99635 82130 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సింహవల్లీ తాయారుకు లక్ష కుంకుమార్చన



తిరువీధిలో హారతి అందుకుంటున్న అమ్మవార్లు

సింహాచలం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వేంజేసిన సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన విశేషంగా నిర్వహించారు. సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణంలో వేదికపై వేంజేపచేశారు. లక్ష నామాలతో అమ్మవార్లకు కుంకుమపూజ జరిపారు. విశేష హారతులందించారు. పూజలో పాల్గొన్న భక్తులకు శేషవస్త్రాలు, కుంకుమ ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారికి ఆలయ బేడామండపంలో తిరువీధిని పెద్ద ఎత్తున జరిపారు. అనంతరం సహస్రనామార్చన పూజ ఘనంగా నిర్వహించారు.

గణపతి నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ పీలా, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక సూర్యనగర్‌లోని సంపత్ వినాయక ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న గణపతి ఉత్సవాల పోస్టర్‌ను మేయర్ పీలా శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. మేయర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 4 వరకు ప్రతి రోజూ గణపతి హోమం జరుగుతుందన్నారు. ఆఖరి రోజు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వెంపరాల వెంకటేశ్వర్లు, హెచ్ఎస్ రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, హారిక, ధనుంజయ్‌రాజు, ప్రభాకరరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



అప్పలనాయుడు

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి పులగానిపాలెంలో నివాసం ఉంటున్న మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైనట్లు కటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామంలో రొంగలి అప్పలనాయుడు(49), భవానీ దంపతులు కటుంబంతో నివాసం ఉంటున్నారు. కొన్నాళ్లుగా అప్పలనాయుడు మతిస్థిమితం కోల్పోయి, చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, కుటుంబ సభ్యుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో భార్య భవాని పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెచ్‌సీ అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోమల దండయాత్ర

- మండల పరిధి గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానం
- దోమల వ్యాప్తితో ప్రజల ఇక్కట్లు
- పీహెచ్‌సీల్లో పెరుగుతున్న జ్వరపీడితులు
- పట్టించుకోని జీవీఎంసీ, పంచాయతీ యంత్రాంగం

చీకటి పడితే చాలు దోమల దండయాత్ర మొదలవుతోంది. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం దోమల బెడదకు మరింత కారణమవుతోంది. దీంతో జీవీఎంసీ, పరవాడ మండల పరిధి గ్రామాల్లో జ్వర పీడితులు పెరుగుతున్నారు. పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీల పరిధిలో విషజ్వరాలు, ఇతర సమస్యలతో వస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

పరవాడ: మండల పరిధిలో గ్రామాల్లో దోమల బెడద పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేక, డస్ట్‌బిన్లలోని చెత్తను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. డ్రైనేజీలు పూడుకుపోయి వర్షాల సమయంలో మురుగు రోడ్లపైకి, ఇళ్ల పరిసరాల్లోకి చేరి దారుణ పరిస్థితి నెలకొంటోంది. దీంతో మండల వ్యాప్తంగా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్న భయంలో ప్రజలున్నారు.

గత ప్రభుత్వంలో నిరంతర పర్యవేక్షణ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై ఆరా తీసేవారు. ఎప్పటికప్పుడు వ్యాధుల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు మచ్చుకైనా కానరావట్లేదు. వ్యాధులు విజృంభించాక తప్ప, ముందస్తు చర్యల్లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజారోగ్యం, పారిశుధ్యంపై శ్రద్ధ వహించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

పారిశుధ్యం అధ్వానం

గొర్లివానిపాలెం జేఎస్ఎన్‌యూఆర్ఎం, టిడ్కో కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. దీంతో దోమల బెడద పెరిగిందని కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. కాలనీ పరిసర ప్రాంతాలు, కాలువలు, రోడ్లు చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచి, దోమల వ్యాప్తికి కారణమవుతున్నట్లు నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

చెత్త తరలింపు చర్యలు శూన్యం

వాడచీపురుపల్లిలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే పరిస్థితి మచ్చుకైనా కానరావట్లేదు. దీంతో డస్ట్‌బిన్లు నిండిపోయి, వ్యర్థాలు చుట్టూ పేరుకుపోతున్నాయి. కుక్కలు, కోళ్లు, పక్షులు వాటిని చెల్లాచెదురు చేస్తుండడంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. పరవాడ, తానాం, ముత్యాలమ్మపాలెం గ్రామాల్లోనూ ఇవే పరిస్థితులున్నాయని ప్రజలు వాపోతున్నారు.



వాడచీపురుపల్లిలో ఓ డస్ట్‌బిన్ వద్ద పరిస్థితి


పీహెచ్‌సీ పేరు	సగటు ఓపీలు	జ్వర పీడితులు
పరవాడ	120-130	30
వాడచీపురుపల్లి	75-80	15

(గత నెలలో వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధి నాయుడుపాలెంలో పచ్చిగోళ్ల వర్షిత(13)కు డెంగ్యూ సోకింది. వైద్య సేవల అనంతరం తగ్గుముఖం పట్టింది.)



కాలనీలో కాలువల్లో పేరుకుపోయిన పూడికలు

కాలువలు పూడుకుపోయి..



దేశపాత్రునిపాలెం మురుగు కాలువలో నిలిచిన మురుగునీరు

దేశపాత్రుని పాలెంలో మురుగు కాలువలు పూడుకు పోయి, మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. జీవీఎంసీ అధికారు లు కనీస చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి యూనియన్ బ్యాంకు ఏరియాలో సరైన కాలువ సదుపాయం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎస్సీ కాలనీ రోడ్డు, పరవాడ వెళ్లే ప్రధాన మార్గంలో కాలువలు మరింత అధ్వానంగా మారాయి.

పారిశుధ్యం మెరుగుపర్చాలి



జేఎస్ఎన్‌యూఆర్ఎం, టిడ్కో కాలనీల్లో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. కాలువలు, రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోతున్నాయి. దోమలు పెరిగి కాలనీ వాసులు విష జ్వరాల బారిన పడుతున్నారు. పారిశుధ్య మెరుగుకు తక్షణ చర్యలు చేపట్టాలి.

– బంగారమ్మ, టిడ్కో కాలనీ, గొర్లివానిపాలెం

సీసీ కాలువలు ఏర్పాటుచేయాలి



దేశపాత్రునిపాలెంలో మురుగు కాలువలను అభివృద్ధి చేయాలి. కాలువలు, గుంతల్లో నిలిచిన మురుగు నీటి వల్లే దోమలు పెరిగిపోతున్నాయి. కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. సీసీ కాలువలుగా అభివృద్ధి చేసి, ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చూడాలి.

– శనివాడ ప్రకాష్, దేశపాత్రునిపాలెం


దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలి



దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నాం. దోమల్ని అరికట్టేందుకు పంచాయతీ అధికారులు ఫాగింగ్ చర్యలు చేపట్టాలి. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి జ్వరాలు విజృంభించక ముందే దోమల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎం.అమ్మాజీ, వాడచీపురుపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



వర్షాకాలంలో దోమలు కుట్టడడం వల్ల జ్వరాల బారిన పడుతుంటారు. వ్యాధుల నియంత్రణకు మా వంతు కృషి చేస్తున్నాం. విష జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం.

– వి.కనకప్పారావు, ప్రభుత్వ వైద్యాధికారి, వాడచీపురుపలి

క్రమశిక్షణతో చదివితే న్యాయవాద వృత్తిలో రాణింపు



న్యాయ విద్యార్థుల తరగతి గదుల్ని పరిశీలిస్తున్న ఆచార్య రణబీర్ సింగ్ తదితరులు

సబ్బవరం: న్యాయ విద్యార్థులు క్రమశిక్షణతో, కష్టపడి చదివితే న్యాయవాద వృత్తిలో రాణించి, ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని నల్సార్ యూనివర్సిటీ, ఢిల్లీ నేషనల్ లా యూనివర్సిటీల పూర్వ ఉపకులపతి ఆచార్య రణబీర్ సింగ్ అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లోని ఎల్ఎల్ ఎం, ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయ విద్యను అభ్యసించేవారు ఎంతో మెళకువతో తమ చదువును కొనసాగించాలన్నారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న పోకడలు, వాటికి అనుగుణంగా చట్టాల్లో వస్తున్న మార్పులను అవలోకనం చేసుకుంటూ, చదువు కొనసాగించాలని సూచించారు. గతంలో వేరే అవకాశాలు లేక న్యాయ విద్యను ఎంచుకునేవారని, ప్రస్తుతం న్యాయ విద్యను ఎంతో ఇష్టంగా ఎంచుకుని చేరుతుండటంతో భవిష్యత్తుపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుతం సుప్రీం కోర్టు, హైకోర్టులలో న్యాయాధిపతులుగా ఉన్న తమ విద్యార్థులు, ఆ స్థాయికి చేరడానికి ఎంతగానో శ్రమించారని పేర్కొన్నారు. డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థులకు న్యాయ విద్య, దానిలోని ఉపాధి అవకాశాలపై ప్రతివారం నిపుణులచే అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను న్యాయ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల కాలుష్య తీవ్రతపై రాస్తారోకో



లంకెలపాలెం కూడలిలో రాస్తారోకో నిర్వహించిన సిటు నాయకులు, కార్యకర్తలు

పరవాడ: ఫ్లైయాష్, బొగ్గు లారీలు విడుదల చేస్తున్న కాలుష్యం నుంచి లంకెలపాలెం ప్రజలకు విముక్తి కలిగించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిటు ఆధ్వర్యంలో లంకెలపాలెం కూడలిలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ హిందూజా, ఎన్టీపీసీ పరిశ్రమలకు చెందిన బొగ్గు, బూడిద లారీలు పరిమితి మించి అధిక లోడ్లతో ప్రయాణించి, తీవ్ర కాలుష్యానికి కారణమవుతున్నాయని ఆరోపించారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఫార్మా పరిశ్రమల నుంచి విడుదలవుతున్న విష వాయువులు ఇబ్బందికరంగా మారాయన్నారు. భారీ వాహనాల ద్వారా ఎగసిపడుతున్న దుమ్మూధూళితో ప్రజలు ఇళ్లలో ఉండలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బూడిద, బొగ్గు లారీలపై దాడులు జరిపి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిటు నాయకులు కె.వెంకట్రావు, కె.వెంకటస్వామి, వి.పద్మ, నానాజీ అమ్మ, అప్పారావు, శ్రీను, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

'బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి'

సెంట్రల్ బ్యాంక్ రీజనల్ ఈడీ ఎంవీ మురళీకృష్ణ



సెంట్రల్ బ్యాంకు సేవలు, బీమా పథకాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఈడీ మురళీకృష్ణ, తదితరులు

సబ్బవరం: ప్రతి బ్యాంకు ఖాతాదారు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై) వంటి జీవిత, ప్రమాద బీమా పథకాలను కుటుంబ భవిష్యత్, భద్రత కోసం తీసుకోవాలని సెంట్రల్ బ్యాంకు రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) ఎంవీ మురళీకృష్ణ తెలిపారు. సబ్బవరం సమీపంలోని గొటివాడలో సెంట్రల్ బ్యాంక్ సబ్బవరం శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజలకు ఆర్థిక, సాక్షరత, సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బీమా పథకాల ద్వారా ప్రజలు తక్కువ ఖర్చుతో ఎక్కువ భద్రత పొందవచ్చన్నారు. ప్రపంచంలో ఇంత తక్కువ ప్రీమంతో బీమా పాలసీ లు మరెక్కడా లేవన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఖాతా ల్లో లావాదేవీలు నిరంతం కొనసాగించడం ద్వారా బీమా ప్రీమియం తమ ఖాతాల నుంచి చెల్లించబడతాయన్నారు. స్థానిక ఎస్ఐ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రజలకు వచ్చే ఫ్రాడ్ కాల్స్, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తొలుత బ్యాంకు ద్వారా అందిస్తున్న పలు సేవలు, బీమా పథకాల బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఏవీ రమణమూర్తి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ, రీజనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ చందన కుమార్ దాస్, సబ్బవరం మేనేజర్ ఎ.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. పలువురు భక్తులు ముడుపులు కట్టారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సిరులు కురిపించవే.. శ్రీమహాలక్ష్మీ

- ఆఖరి శుక్రవారం శ్రావణలక్ష్మికి విశేష పూజలు
- భక్తులతో కిటకిటలాడిన అమ్మవార్ల దేవాలయాలు



సాధుమఠం వద్ద విశేషాలంకరణలో సంతోషిమాత



అలివేలు మంగమ్మ సన్నిధిలో పూజల్లో పాల్గొన్న భక్తులు



విజినిగిరిపాలెంలో కొలువుదీరిన ఉమాదేవి



పూజలందుకున్న అలివేలు మంగమ్మ



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: పవిత్ర శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పూజలు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించా రు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని అమ్మవార్ల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

- చినముషిడివాడ దరి అలివేలు మంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పసుపు-కుంకుమలు, పాలు, పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు జరిపారు. లక్ష్మీ, విష్ణు సహస్రనామార్చనలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.
- ఎస్ఆర్ పురంలో కొలువైన కనకదుర్గమ్మకు జిల్లా నలు మూలల నుంచి తీసుకువచ్చిన పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మక కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రిమాత ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
- సాధుమఠం సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు, హోమాలు జరిగాయి.
- పెందుర్తి కన్యకా పరమేశ్వరి, మహా కామేశ్వరీ ఆలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు. భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

సింహాచలం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అడవివరంలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సింహాచలం దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి విశేషంగా కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవమూర్తిని వేంజేప చేసి, భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజ జరిపారు. విశేష హారతులందించారు.


- అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఉమాదేవికి విశేష పూజలు జరిగాయి. పలు రకాల పుష్పాలు, కుంకుమతో పూజలు చేశారు. భక్తులు, గ్రామస్తులు అశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ ఈ కార్యక్రమాలను నిర్వహించారు.



వేంకటేశ్వర ఆలయంలో కొలువైన లక్ష్మీదేవి



సుజాతనగర్లో కనకదుర్గమ్మ



పుష్పాలంకరణలో ఎస్ఆర్‌పురం కనకదుర్గ

చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి



ఆర్.మల్లికార్జునరావు సీఐ, పరవాడ

పరవాడ: వినాయక మండపాలకు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. పోలీస్ శాఖ అనుమతుల్లేకుండా ఎలాంటి మండపాలు ఏర్పాటు చేయకూడదన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండపాల అనుమతులను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చన్నారు. ఇందుకు ఎలాంటి రుసుం చెల్లించనక్కర్లేదని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్నాక పోలీసులు సంబంధిత ప్రదేశానికి వెళ్లి, ఎలాంటి ఇబ్బందుల్లేవని గుర్తించాకే అనుమతులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన మండపాలకు మాత్రమే అనుమతులు లభిస్తాయన్నారు. మండపాలకు విద్యుత్ పరమైన సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. మండపాల్లో పేలుడు, మత్తు పదార్థాలు, జూదం నేరమన్నారు. డీజే సిస్టమ్ వాడకూడదని హెచ్చరించారు. రహదారులకు అడ్డంగా ఏర్పాటు చేసిన మండపాలను తొలగిస్తామన్నారు. బలవంతంగా చందాలు వసూలు చేయరాదన్నారు. విగ్రహాల నిమజ్జనం అధికారికంగా గుర్తించిన ప్రదేశాల్లోనే చేయాలని సీఐ తెలిపారు.

NTPC Simhadri

Assessment Camp for Aids & Assistive Devices for Persons with Disabilities (PwDs)

The Assessment Camp for Aids and Assistive Devices for PwDs is scheduled on **25th and 26th August 2025 from 10:00 AM to 01:00 PM** at the MPDO Office, Parawada. The camp is being jointly organised by NTPC Simhadri and AMTZ.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెందుర్తి 9912222753

Office mail : sakshiadvtvsp@gmail.com